క్లుప్తంగా

'చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలి'

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం ఇసుక క్వారీలకు వచ్చే లారీలతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు అలీంఖాన్ బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాటారంలో ఓ వ్యక్తి పై నుంచి లారీ వెళ్లడంతో కాళ్లు విరిగాయని, కుదురుపల్లిలో బైక్‌పై వస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతి

భూపాలపల్లి రూరల్ : రాష్ట్రంలోని బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని ఏఓకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి నాయకులు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భీమనాథుని సత్యనారాయణ, వేముల శ్రీకాంత్‌లు మాట్లాడారు. బీసీ జనాభా ప్రతిపాదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. నాయకులు క్యాతరాజు సతీష్, రాంబాబు, జుబేర్ ఉన్నారు.

రేపు సింగరేణి పాఠశాల ఆవిర్భావ దినోత్సవం

భూపాలపల్లి అర్బన్ : సింగరేణి పాఠశాల ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2004 సంవత్సరంలో ఏరియాలో 1 నుంచి 5వ తరగతి వరకు ప్రారంభించిన ఈ పాఠశాల ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది నట్లు పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రారంభించాలని యాజమాన్యానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.

ట్రామర్ల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి అర్బన్ : ఏరియాలో పని చేస్తున్న ట్రామర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి కంపేటి రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఏరియాలోని కేటీకే-1వ గనిలోని కార్మికులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు నాణ్యమైన రక్షణ పరికరాలు ఇవ్వడం లేదని, ఎన్నికలలో నాణ్యమైన బూట్లు ఇప్పిస్తామన్న నాయకులు వాటిని పట్టించుకోవడంలేదని విమర్శించారు. టిపర్లలోకి టబ్బులను పంపేటప్పుడు చాలా కష్టతరమవుతుందన్నారు.

ఇసుక క్వారీల్లో విధులు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని పలు ఇసుక క్వారీల్లో ఉన్నతాధికారుల ఆదేశాలతో కానిస్టేబుల్, రెవెన్యూ ఉద్యోగి విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి టీజీఎండీసీ, ఇరిగేషన్, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఇసుక అక్రమ రవాణా, ఓవర్‌లోడుపై దృష్టిసారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో బుధవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు ఒక్కో క్వారీలో విధులకు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

పులి జాడ కోసం అధికారుల గాలింపు..

కాటారం : మండలంలోని నస్తూర్‌పల్లి అడవిలో పులి జాడ కోసం అటవీశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. మూడ్రోజుల క్రితం నస్తూర్‌పల్లి గ్రామానికి చెందిన ఓ రైతుకు పులి కనిపించినట్లు ప్రచారం జరిగింది. దీంతో అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పులి అడుగు ముద్రలను గుర్తించారు. పులి ఈ ప్రాంతంలోనే ఉన్నట్లు నిర్ధారణకు వచ్చి మరుసటి రోజు నుంచే అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. కాటారం, మహదేవపూర్, పెగడపల్లి రేంజ్ పరిధిలోని అడవిలో గల వాగులు, వంకలు, విశాలంగా ఉన్న ప్రదేశాలను పరిశీలించారు. రెండ్రోజుల క్రితం వీరాపూర్ సమీపంలో పులి అడుగుల ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించినప్పటికి పూర్తి స్థాయిలో వాటిని నిర్ధారించలేదు. బుధవారం సైతం అటవీ ప్రాంతాల్లో పులి జాడ కోసం అధికారులు విస్తారంగా గాలింపు చేపట్టారు. కానీ ఎక్కడ కూడా పులికి సంబంధించిన ఆనవాళ్లు లేవని కాటారం రేంజ్ అధికారి స్వాతి తెలిపారు. రాత్రి పూట అడవి సమీపంలోని పంట పొలాల్లోకి వెళ్లడానికి రైతులు ప్రజలు జంకుతున్నారు.

అడవులను రక్షించుకోవాలి

వెంకటాపురం(కె) : అడవులను రక్షణ అందరి బాధ్యత అని వెంకటాపురం సెక్షన్ అధికారి దేవయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నూగూరు, మహితాపురం గ్రామస్తులకు అడవుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. అడవుల సంరక్షణతోనే స్వచ్ఛమైన గాలి లభిస్తుందని తెలిపారు. అడవికి నిప్పు పెడితే జీవరాశులకు నీడ, ఆహారం లభించక అంతరించి పోతాయని సూచించారు. ప్రజలు అడవిలోకి ఇప్పపువ్వు, చీపుర్ల సేకరణకు వెళ్లినప్పుడు నిప్పు పెట్టకుండా ఇప్ప చెట్ల కింద పరదాలు పర్చుకొని సేకరించుకోవాలని చెప్పారు.

ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

- మరో 4నెలల్లో కోత దశకు..
- మార్కెటింగ్ బాధ్యత సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్‌దే..
- పంట సాగుపై రైతుల ఆసక్తి



టేకుమట్ల : ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న వంట నూనెలన్నింటిలో ఆయిల్ పామ్ నూనె మధ్య, దిగువ తరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో ఉంది. ఆయిల్ పామ్ పంటను మొదట ఆఫ్రికా ఖండంలో పండించే వారు. కాలక్రమేణా విస్తరించి ఇప్పుడు అన్ని ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్నారు. దేశంలో ప్రస్తుతం ఉన్న జనాభాకు సరిపడా ఆయిల్ పంటలను సాగు చేయకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి పామాయిల్ ముడి సరుకును దిగుమతి చేసుకుని ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, కృష్ణపట్నంలోని రిఫైనరీలు రిఫైండ్ ఆయిల్‌గా మార్చి సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఆయిల్ పామ్ పంటను పండించడం ద్వారా ఇతర దేశాలకు మనమే ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఆయిల్ పామ్ సాగు వివరాలు..

12–15 నెలల కాలం వరకు నర్సరీలో ఆయిల్ పామ్ మొక్కలను రక్షించి వ్యవసాయ క్షేత్రానికి తరలిస్తారు. హెక్టారుకు 143, ఎకరాకు 58 మొక్కలు నాటే అవకాశం కలిగి ఉంటుంది. చెట్టు సుమారు 15 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. అదే హైబ్రిడ్ మొక్క మాత్రం కేవలం 4–5మీటర్ల ఎత్తు మాత్రమే ఎత్తు పెరుగుతుంది. ఒక్కో మొక్క ఏడాదికి సుమారు 1–2 అడుగుల ఎత్తు పెరుగుతుంది. కాండం భాగంలో పూలు గుత్తులుగా పూయడంతో పరాగ సంపర్కం ద్వారా కాయలు పండ్లుగా మారేందుకు సుమారు 5–6 నెలల సమయం పడుతుంది. ఒక్కో పండ్ల గెల 20–30 కిలోల బరువు ఉంటుంది. 25 సంవత్సరాల కాలం తర్వాత చెట్లను తొలగించి కొత్త మొక్కలు నాటితే అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

పామాయిల్ తోటల పెంపకం..

పామాయిల్ తోటల పెంపకాన్ని చిన్న, మధ్య, భారీ వ్యవసాయ క్షేత్రాలుగా విభజించారు. చిన్న తరహాలో 2–10 హెక్టార్లు, మధ్య తరహాలో 10 నుంచి 300 హెక్టార్లు, భారీ వ్యవసాయ క్షేత్రాల్లో 500 హెక్టార్లలో పంటలను సాగు చేస్తారు.

అంతర పంటలకు పెట్టుబడి సాయం..

ఆయిల్ పామ్ పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు అంతర పంటలకు పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.4,200లు అందజేస్తోంది. ఆయిల్ పామ్ మొక్క ఎదిగేంత వరకు (నాలుగు సంవత్సరాల) పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నారు. అంతే కాకుండా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఆయిల్ పామ్ పంటలను సాగులో బిందు సేద్యం (డ్రిప్) ఏర్పాటుకు 90శాతం రాయితీని కల్పిస్తూ పరికరాలను అందిస్తున్నారు.

రేగొండలో ఆయిల్ పామ్ నర్సరీ..

రేగొండలో సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ నర్సరీని ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని మండలాలకు రేగొండ నుంచే ఆయిల్ పామ్ మొక్కలు సరఫరా చేస్తున్నారు. 2021–22 సంవత్సరంలో సాగుచేసిన ఆయిల్‌పామ్ పంట మరో ఐదునెలల్లో కోత దశకు చేరనుంది.

ఖమ్మంలోని ఆయిల్‌పామ్ మిల్లుకు తరలింపు..

ప్రస్తుతం ఆయిల్ పామ్ మిల్లు జిల్లాలో ఎక్కడా లేకపోవడంతో ఖమ్మం జిల్లాలోని ఆయిల్ పామ్ మిల్లుకు రైతులు పండించిన గెలలను తరలించనున్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు వెల్లడించారు.

ఆయిల్‌పామ్ సాగు చేసిన విస్తీర్ణం (సంవత్సరానికి ఎకరాల్లో)
2021-22లో సాగుచేసిన విస్తీర్ణం- 353
2022-23లో సాగుచేసిన విస్తీర్ణం- 1,878
2023-24లో సాగుచేసిన విస్తీర్ణం- 1,164
2024-25లో సాగుచేసిన విస్తీర్ణం- 362

టన్నుకు రూ.20,000 మద్దతు ధర..

చీడపీడల బెడద లేకుండా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే ఆయిల్ పామ్ పంటకు టన్ను కు రూ.20,000 మద్దతు ధర ప్రకటించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పండిస్తు న్న ఆయిల్‌పామ్ పంటను మార్కెటింగ్ చేసేందుకు పూర్తి బాధ్యత సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ తీసుకోవడంతో రైతులకు ఎలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుంది.

సొంత వైద్యం.. ఆరోగ్యానికి ముప్పు



డాక్టర్ ఫస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

భూపాలపల్లి అర్బన్ : ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సొంత వైద్యంతో ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని కూరపాటి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ కూరపాటి రమేశ్ తెలిపారు. కూరపాటి ఫౌండేషన్, ఐఎంఏ భూపాలపల్లి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సంయుక్తంగా బుధవారం 'డాక్టర్ ఫస్ట్' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ..గ్లోబలైజేషన్ కారణంగా ఇంటర్నెట్ యుగంలో ఆరోగ్య సమస్యలకు సొంత వైద్యం, మందుల షాపుల్లో మందులు కొనుక్కొని వాడే సంస్కృతి ఎక్కువగా అయిందన్నారు. డాక్టర్ కూరపాటి రాధిక, స్థానిక వైద్యులు పాల్గొన్నారు.

మిర్చికి కనీస మద్దతు ధర ప్రకటించాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వెంకటరమణారెడ్డి తదితరులు

రేగొండ : మిర్చి పంటకు కనీస మద్దతు ధర రూ.20,500 ప్రకటించాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుకు వెన్నుపోటు పొడుస్తోందన్నారు. ఏడాదిన్నర కాలంలో రైతుభరోసా, రుణమాఫీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. పెట్టుబడి భారం తట్టుకోలేక 410 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. అనంతరం రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో మెజారిటీ గ్రామపంచాయతీల్లో గులాబీ జెండా ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, నాయకులు జూపాక నీలాంబరం, రఘుసాల తిరుపతి, కోలేపాక భిక్షపతి, కానుగంటి శ్రీనివాస్, పకిడే కిరణ్, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణం దగ్ధం

- రూ.12 లక్షల ఆస్తి నష్టం, బూడిదైన రూ.లక్ష నగదు

గోవిందరావుపేట: మండలంలోని పస్రా గ్రామానికి చెందిన బొల్ల అశోక్ కిరాణా దుకాణంలో బుధవారం షార్ట్ సర్క్యూట్ అయ్యింది. షాపులోని సామగ్రి, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.12 లక్షల ఆస్తి నష్టం కావడంతో పాటు రూ.లక్ష నగదు కాలి బూడిదైంది. లింగాలకు వెళ్లే దారిలో అశోక్ కొన్నాళ్లుగా షాపును అద్దెకు తీసుకుని నడిపిస్తున్నాడు. మేడారంలో అమ్మవార్లని దర్శనం చేసుకునేందుకు మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో షాపుని మూసేశాడు. కొద్దిసేపటికి షాపులో నుంచి పొగ రావడాన్ని గమనించిన స్థానికులు అశోక్‌కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. అశోక్ తిరిగి వచ్చే సరికి సామగ్రి, వస్తువులు మొత్తం కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదం కారణంగా తాము రోడ్డున పడ్డామని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని అశోక్ కోరుతున్నాడు.



షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదైన కిరాణం షాపు

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

రేగొండ : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని దమ్మన్నపేట శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకుని విచారించారు. ఇసుక తరలింపునకు డ్రైవర్ వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేవని గుర్తించినట్లు చెప్పారు. దమ్మన్నపేటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బోయిని రాజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

‘బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలి’

భూపాలపల్లి రూరల్ : వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గ బీజేపీ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డి గెలుపునకు మద్దతుగా కార్యకర్తలు కృషిచేయాలని జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నం యుగేందర్, చందుపట్ల సత్యపాల్ రెడ్డి, రాంచంద్రారెడ్డి, జన్నె మొగిలి, బీజేవైఎం నాయకులు సయ్యద్ గాలిప్ తదితర అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్ రెడ్డి

మేడారం తరలిన భక్తులు



వనదేవతల జాతరకు వెళ్తున్న భక్తులు

వాజేడు : ఎస్ఎస్‌తాడ్వాయి మండలంలో సమ్మక్క, సారక్క జాతర మొదలు కావడంతో బుధవారం భక్తులు వాహనాల్లో కుటుంబ సమేతంగా తరలి వెళ్లారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు ట్రాక్టర్, ఆటోలు, ఇతర వాహనాల్లో దర్శించుకునేందుకు వెళ్లారు.

ఐలాపుర్ జాతరలో వైద్యశిబిరం



ఐలాపుర్ జాతరలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

కన్నాయిగూడెం : మండలంలోని ఐలాపుర్‌లో బుధవారం నుంచి వన జాతర ప్రారంభం కావడంతో మండల వైద్యశాఖ కొండాయి, ఐలాపుర్ జాతరలో వైద్యశిబిరం ఏర్పాటు చేసింది. సర్వాయి నుంచి ఐలాపుర్ గ్రామానికి సారలమ్మ రాకతో జాతర ప్రారంభం కానుంది. వన దేవతల జాతరకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకుంటారు. ఐలాపుర్‌లోని సమ్మక్క సన్నిధి పరిసర ప్రాంతంలో స్థానిక వైద్యులు అభినవ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.అత్యవసరమైతే మెరుగైన వైద్యం అందించే విధంగా 108 సేవలను అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ వైద్యులు ఎం. గిరిబాబు, వరప్రసాద్, సుజాత, శారద, మనిషా, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

పథకాల పేరుతో ప్రచార ఆర్భాటం

- మాజీ జెడ్పీటీసీ జోరుక సదయ్య

మొగుళ్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వం పథకాల పేరుతో ప్రచార ఆర్భాటాలు చేస్తుంది తప్ప వాటి అమలును మరిచిందని మాజీ జెడ్పీటీసీ జోరుక సదయ్య విమర్శించారు. బుధవారం మండలంలోని బంగ్లాపల్లి, వేములపల్లి, కాసులపాడు గ్రామాల్లో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోడారి రమేష్, జిల్లా నాయకుడు బెల్లంకొండ శ్యాంసుందర్ రెడ్డితో కలిసి ఆయన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అంశాలపై పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచనలు చేశారు. మాట తప్పిన ప్రభుత్వం, మాయమాటల కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజల్లో ఎండగట్టలన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తప్ప తట్టెడు మట్టి తీయలేదన్నారు. పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకులు పనిచేయాలని సూచించారు. కృష్ణారెడ్డి, దానవేణి రాములు, నైనకంటి ప్రభాకర్ రెడ్డి, బద్దం జైపాల్ రెడ్డి, అనబోయిన కుమార్, మహమ్మద్ యాకూబ్, అరెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సదయ్య

ఇసుక లారీ ఢీకొని ముగ్గురికి గాయాలు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కుదురుపల్లి సమీపంలో ఇసుక లారీ ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం పై వస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లికి చెందిన మేకల రాకేశ్, గాజుల ప్రేమ్ కుమార్, వైద్య లక్ష్మణ్ ప్రసాద్ బుధవారం కాళేశ్వరం ఆలయానికి దర్శనానికి వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలోని కుదురుపల్లి వద్ద మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వైపునకు వెళ్తున్న ఇసుక లారీ వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి కాళ్లు విరిగగా, లక్ష్మణ్ ప్రసాద్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. కాగా, లారీ ఘటన స్థలంలో నిలిపివేయకుండా డ్రైవర్ పరారీ అయ్యాడని పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



చికిత్స పొందుతున్న లక్ష్మణ్‌ప్రసాద్

కార్మికులకు వేతనాలు పెంచాలి

- యూఐఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు బాపుయాదవ్

కాటారం : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని భారత ఐక్య యువజన సమాఖ్య (యూఐఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపుయాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాపుయాదవ్ మాట్లాడారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీలు తమ అభ్యర్థులను గెలిపించి అధికారంలోకి వస్తే పాఠశాలల్లో పని చేసే కార్మికుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వాలు నెలకు రూ.10వేలు వేతనాలు అమలు చేయాలని లేకపోతే వారి పక్షాన రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు తప్పవని బాపుయాదవ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దయ్యం పోచయ్య, కార్మిక సంఘం నాయకులు గడ్డం సమ్మయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాపుయాదవ్

పరిమితికి మించి తరలించొద్దు

వెంకటాపురం(కె) : వాహనాల్లో పరిమితికి మించి కూలీలను తరలించొద్దని వెంకటాపురం ఎస్సై తిరుపతి రావు అన్నారు. బుధవారం మండలంలోని ఆలుబాక సమీపంలో ముత్తారం క్రాస్ వద్ద ఎస్సై తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ రైతులు మిర్చి కూలీలను ట్రాక్టర్లలో తరలించే క్రమంలో వాహన పరిమితికి మించి కూలీలను తీసుకుపోవద్దని అన్నారు. వాహనానికి తగిన ధ్రువపత్రాలు, డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండేలా రైతులు చూసుకోవాలని తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై తిరుపతి రావు

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక

మొగుళ్లపల్లి : మండలంలోని మొట్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు భీమనాథుని సాయిచరణ్, జన్నె అర్జున్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి లింగాల కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను శాలువాతో సత్కరించి ప్రత్యేక బహుమతులను అందజేశారు.

‘మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి’



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం చేస్తున్న శ్రీపాల్‌రెడ్డి

ములుగు : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో తెలంగాణ మోడల్‌స్కూల్ ఉద్యోగులు మరణిస్తే ఆ కుటుంబంలో కారుణ్య నియామకం అందించేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేం యాకూబ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కోకిల శ్రీరంగం, దేవులపల్లి సత్యనారాయణ, జగదీశ్, కాసర్ల రమేష్, నాగేశ్వర్‌రావు, తులసిరాం, ముకుందరెడ్డి, శివప్రసాద్, రాజయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మొగుళ్లపల్లి: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

మొగుళ్లపల్లి : మండల కేంద్రానికి చెందిన గుండారపు నరేష్, కోడారి ఐలయ్య ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాలను బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పుట్ట మధు పరామర్శ

కాటారం : మండలంలోని పలు బాధిత కు టుంబాలను బుధవారం మంథని మాజీ ఎమ్మె ల్యే పుట్ట మధు పరామర్శించారు. బయ్యారం గ్రామానికి చెందిన పసుల సమ్మయ్య, గారెపల్లికి చెందిన కడారి దుర్గయ్య, అక్కపాక మణెమ్మ మృతి చెందగా బాధిత కుటుంబాలను పుట్ట మధు ఓదార్చారు. ఇసుక లారీ ప్రమాదంలో గాయపడి కాళ్లు కోల్పోయిన సబ్‌స్టేషన్‌పల్లికి చెందిన తోట రవిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. నాయకులు జక్కు రాకేశ్, జోడు శ్రీనివాస్, రామిళ్ల కిరణ్, పంతకాని సద్మలి, గాలి సద్మలి, దుర్గారావు, మల్లయ్య, తదితరులు ఉన్నారు.



కాటారం: పరామర్శిస్తున్న పుట్ట మధు

పరిసరాల శుభ్రతపై కళాజాతా

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం అటవీ పరిసరాల్లో శుభ్రత, ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారథి గోల్కొండ నరేష్ బృందం కళాకారులు ఆట పాటల ద్వారా అవగాహక కల్పించారు. జాతరకు వచ్చే వేలాది భక్తులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దని, పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రాగుల శంకర్, రవి, బుచ్చన్న, రహీముద్దీన్, సాగర్, కిషన్, రాజేందర్, తిరుపతి, భాస్కర్, రాము, శ్రీలత, శోభ, పాల్గొన్నారు.



మేడారంలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు